ధర్నా నిర్వహిస్తున్న రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ

40 రోజులు..507 కిలోమీటర్లు

- 14 నియోజకవర్గాల్లోనూ సాగిన యువగళం - ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

40 రోజులు..507 కిలోమీటర్ల మేర ఉమ్మడి కర్నూలు జిల్లాలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సాగింది. 14 నియోజకవర్గాల్లోనూ పాదయాత్ర సాగగా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ లోకేష్ ముందుకు సాగారు..

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏప్రిల్ 13న డోన్ అసెంబ్లీ నియోజకవర్గంతో ప్రారంభమై మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంతో ముగిసింది. మొత్తం 40రోజుల పాటు జిల్లాలో పాదయాత్ర సాగింది. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 45 మండలాలు, 281 గ్రామాల మీదుగా 507 కిలో మీటర్లు పొడవున యువగళం పాదయాత్ర కొనసాగింది. జిల్లాలో 40 రోజుల పాదయాత్రలో లోకేష్‌కు వివిధవర్గాలు, ప్రజలనుంచి రాతపూర్వకంగా 868 వినతిపత్రాలు అందాయి. కర్నూలులో మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లో బహిరంగసభల్లో పాల్గొన్న లోకేష్ 25 ముఖాముఖి సమావేశాలు నిర్వహించి ఆయా వర్గాల సమస్యలు తెలుసుకున్నారు. దారిడిపొడవునా లోకేష్‌ను మహిళలు, యువకులు, వృద్ధులు కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకుంటున్నారు. యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ నెల 15న శ్రీశైలం నియోజకవర్గం మోతుకూరులో తల్లి భువనేశ్వరితో కలిసి లోకేష్ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఏప్రిల్ 21న ఆదోనిలో యువగళం పాదయాత్ర 1000 కిలో మీటర్ల మైలురాయి చేరుకుంది. ఏప్రిల్ 24న పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆదోని నియోజకవర్గం తుంబళం క్రాస్ వద్ద పల్లెప్రగతి కోసం మీ లోకేష్ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీరహితంగా సర్పంచులు తరలివచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే పంచాయితీలకు నిధులు, విధులు కల్పిస్తామని, వాటర్ గ్రిడ్ ఏర్పాటుతో గ్రామాల్లో 24/7 సురక్షితమైన తాగునీరు అందిస్తామని, సర్పంచులకు గౌరవవేతనంతోపాటు గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సచివాలయ వ్యవస్థను పంచాయితీలకు అనుసంధానిస్తామని తెలిపారు. మే 7న కర్నూలులో ముస్లిం మైనారిటీలతో నిర్వహించిన లోకేష్‌తో గుప్తగు కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లిం సోదరులు తరలివచ్చి వైసిపి ప్రభుత్వం వచ్చాక తాము పడుతున్న కష్టాలు చెప్పుకున్నారు. జగన్ ప్రభుత్వ అసమర్థత వల్లే మైనారిటీలపై దాడులు పెరిగాయని, టిడిపి అధికారంలోకి వచ్చాక ముస్లింలకు రక్షణ కల్పిస్తామని యువనేత భరోసా ఇచ్చారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని, మైనారిటీల ఆస్తుల పరిరక్షణకు వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు కల్పిస్తామని చెప్పారు.

100 కిలో మీటర్లకు ఒక హామీ

పాదయాత్రలో ప్రతి వంద కిలోమీటర్లకు ఒక అభివృద్ధి కార్యక్రమానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయా అభివద్ధి కార్యక్రమాలను పూర్తిచేస్తామని యువనేత హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 5 శిలాఫలకాలను లోకేష్ ఆవిష్కరించారు. డోన్ నియోజకవర్గం ప్యాపిలిలో 900 కిలో మీటర్ల సందర్భంగా గుండాల ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఆదోని సిరిగుప్ప క్రాస్ వద్ద వెయ్యి కిలోమీటర్ల మైలురాయి చేరుకుంది. ఈ సందర్భంగా ఆదోని టౌన్ వార్డ్ 21 ని దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనేగండ్లలో పాదయాత్ర 1100 మైలురాయికి చేరుకున్న సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 10వేలమందికి ఉపాధి కల్పించే టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుచేస్తామని హామీ ఇస్తూ, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నందికొట్కూరు నియోజకవర్గం అల్లూరులో 1200 మైలురాయి సందర్భంగా హంద్రీనీవా నుంచి మిడుతూరు ఎత్తిపోతల పథకానికి హామీ ఇచ్చి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాదయాత్ర 1300 మైలురాయి చేరుకున్న సందర్భంగా యాతం ఫంక్షన్ హాలు వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. నంద్యాల రూరల్ కానాలలో టిడిపి అధికారంలోకి వచ్చాక పసుపు మార్కెట్, కోల్డ్ స్టోరేజి ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేల ఉక్కిరి బిక్కిరి!

పాదయాత్ర సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో లోకేష్ నిర్వహిస్తున్న బహిరంగసభల్లో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు చేస్తున్న అవినీతిని ఆధారాలతో సహా బట్టబయలు చేయడంతో అధికారపార్టీ నేతలకు ముచ్చెమటలు పట్టాయి. డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఆలూరు నియోజకవర్గంలో మరో మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోనిలో సాయిప్రసాద్ రెడ్డి, మంత్రాలయంలో బాలనాగిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వంటి నాయకుల అవినీతిని ప్రజాక్షేత్రంలో తూర్పారబట్టారు. అవినీతి ఎమ్మెల్యేలకు ఆయా నియోజకవర్గాల ప్రజలు పెట్టిన నిక్ నేమ్ లను ఉచ్చరిస్తూ లోకేష్ చేస్తున్న ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా సెల్ఫీ ఛాలెంజులు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో యువనేత పాదయాత్ర సందర్భంగా విసిరిన పలు సెల్ఫీ చాలెంజ్ లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సెల్ఫీ చాలెంజ్ ద్వారా యువనేత లోకేష్ అధికారపార్టీని ఇరకాటంలో పెట్టాయి.

ఉమ్మడి జిల్లాకు ఇచ్చిన ప్రధాన హామీలు..

- కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు
- ఆర్డీఎస్ కుడికాల్వ, వేదవతి, గుండ్రేవుల పనులు పూర్తి
- 68 చెరువులకు హంద్రీనీవా నీళ్లు
- హంద్రీనీవా కాలువ విస్తరణ, తుంగభద్ర ఎల్ఎల్‌సి కాల్వల ఆధునీకరణ
- ఆదోనిలో మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజీ
- ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు
- జొలదరాసి, రాజోలు రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి
- అవుకు రెండో టన్నెల్ నిర్మాణం పూర్తి
- మిడుతూరు ఎత్తిపోతల పథకం నిర్మాణం

న్యాయమైన పరిహారమివ్వాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలంలోని 12 గ్రామాల్లో 326 ఎకరాలను ఆరు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం తీసుకుని ఎకరాకు కేవలం రూ.12.50 లక్షలు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని, న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ముందు బసాపురం, ఉల్చాల, సింగవరం గ్రామాల రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడారు. భూములను సేకరించేటప్పుడు ఎలాంటి చట్టమూ ఉపయోగించకుండా భూసేకరణ చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేయలేదని, భూముల ధర నిర్ణయించలేదని తెలిపారు. రైతుల ఆమోదం లేదని, కానీ రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున జమ చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ ప్రాంత భూములు రూ.1.5 కోట్ల విలువ చేస్తున్నాయని తెలిపారు. అలాంటి భూములకు రూ.లక్షల్లో ఇచ్చి రైతులకు అన్యాయం చేయడం న్యాయమేనా అని ప్రశ్నించారు. అధికారులు రైతుల పరిస్థితిని, భూముల విలువను బట్టి ధర నిర్ణయించి న్యాయమైన నష్టపరిహారం ఇచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు పంపించి ఆర్బిట్రేషన్ నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. డిఆర్ఒ సానుకూలంగా స్పందించాల్సింది పోయి అసహనం వ్యక్తం చేస్తూ రైతులను, రైతు సంఘం నాయకులను చులకన చేసి మాట్లాడడం సరైన పద్ధతి కాదని చెప్పారు. ప్రజలు విజ్ఞాపన చేసిన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అసహనంగా మాట్లాడడం దారుణమని పేర్కొన్నారు. రైతు సంఘం నిరంతరం రైతుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని, రైతుల కోసం ఎన్ని కష్టాలైనా ఎదుర్కొంటుందని తెలిపారు. ఆరు లైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు న్యాయం జరిగేంత వరకు నిరంతరం పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. న్యాయమైన పరిహారం ఇవ్వకుంటే పనులను జరగనివ్వబోమని తెలిపారు. వ్యకాస జిల్లా కార్యదర్శి నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ నాయకులు అంజి, రైతు నాయకులు మాధవరెడ్డి, సుంకన్న, బాధిత రైతులు వెంకటయ్య, నాగన్న, లోకన్న, పరమేశ్వర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- అవినాష్ రెడ్డి అనుచరులపై హత్యాయత్నం కేసు పెట్టాలి

- టిడిపి,సిపిఐ,సిపిఐ, జనసేన, కాంగ్రెస్, బిఆర్ఎస్

- ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా, అడిషినల్ ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/క్రైమ్

ఎంపి అవినాష్ రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్ట్ చేస్తారన్న సమాచారంతో అక్కడకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై అవినాష్ రెడ్డి అనుచరులు కొట్టి గాయపరచడానికి నిరసనగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బసప్ప, నగర అధ్యక్షులు శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిపిఐ జిల్లా నాయకులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఎం కర్నూలు , నంద్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ, ఎ.నాగరాజు, టిపిడి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా, జనసేన రాష్ట్ర నాయకులు చింత సురేష్ బాబు, బిఆర్ఎస్ కర్నూలు కన్వీనర్ మల్లికార్జున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కెవి.నారాయణ మాట్లాడుతూ వార్త కవరేజ్ కోసం వెళ్లిన ఆర్‌టివి, ఆంధ్రజ్యోతి, హెచ్ఎం టివి మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం చాలా హేయమైన చర్య అన్నారు. సిపిఎంగా జర్నలిస్టులకు ప్రతి పోరాటంలో సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. జగన్నాథం మాట్లాడుతూ రక్షణ లేకుండా రాష్ట్రంలో రాక్షస పాలనలో ఉన్నామా ప్రజల మధ్య ఉన్నామా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంతటి అరాచకపాలన ఎక్కడ చూడలేదన్నారు. మీడియాకు స్వేచ్ఛ లేకుండా దాడులకు బరితెగిస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉండే కర్నూలులో టెన్షన్ వాతావరణంసృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ తీవ్రవాదులు ఉగ్రవాదులు ఉండే చోట ఉన్నామా అనే అనుమానం వ్యక్తమవుతోందన్నారు. జనసేన రాష్ట్రనాయకులు చింత సురేష్, బిఆర్ఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ మల్లికార్జున మాట్లాడారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సీనియర్ జర్నలిస్ట్ పానుగంటి చంద్రయ్య, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ఎంయు.వినయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి చట్టరీత్యా కేసులు నమోదు చేయాలన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకుంటే దశల వారిగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు. కలెక్టరేట్ ముందు ఉన్న గాంధీ విగ్రహానికి వినతిని అందించారు. ఆడిషినల్ ఎస్‌పి ప్రసాద్‌కు వినతిని అందించారు. ఆడిషినల్ ఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ డిఎస్‌పి స్థాయి అధికారి ఎస్ఐలను మహిళ పోలిస్‌లను కలిపి కమిటీ ఏర్పాటు చేసి విచారణకు అదేశించేలా ఎస్‌పికి విన్నవించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి నజీర్ బాషా, ఉపాధ్యక్షులు విద్య సాగర్, సహాయ కార్యదర్శి సునీల్ కుమార్, నాయకులు వెంకటేష్, నాగేంద్రుడు, మోహన్ ,డోన్ విలేకరి గోపికృష్ణ, మెట్రో టివి స్టాఫర్ మధు, నాగేష్, కిషోర్ కుమార్‌రెడ్డి, ఎఐవైఎఫ్, జనసేన, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ ధర్నాకు హాజరయిన సిపిఐ, సిపిఎం , టిడిపి , కాంగ్రెస్ నాయకులు

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-పత్తికొండ

ఈ నెల 30న ముఖ్యమంత్రి పత్తికొండలో పర్యటించనున్న సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం పత్తికొండ ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా హెలీప్యాడ్, రహదారి మరమ్మత్తులు, ఎలక్ట్రికల్ పనులు, వేదిక, సీటింగ్ ఏర్పాట్లు, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడి స్క్రీన్లు, సెక్యూరిటీ తదితర అన్ని అంశాల్లో ఎక్కడా లోటు పాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు..

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాట్లు పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. సభలో పాల్గొన్న ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు మంచి నీరు ఇబ్బంది కలగకుండా వాటర్ కౌంటర్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో పారిశుధ్య పనులను డిపిఒ పర్యవేక్షించాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి ఏర్పాటు చేయాలన్నారు. సభా వేదిక వద్ద ప్రోటోకాల్ ప్రకారం వైద్యులతో పాటు అంబులెన్స్ లు ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ హెలీప్యాడ్ ఏర్పాటు, బ్యారికేడింగ్ పనులను ఆర్అండ్‌బి అధికారులు మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, పత్తికొండ తాహాశీల్దార్ విష్ణు ప్రసాద్ జిల్లా , మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీమృతి

మద్దమ్మ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి-గూడూరు

కర్నూలు జిల్లా గూడూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన తెలుగు మద్దమ్మ (50) సోమవారం ఉపాధి పనికి వెళ్లి వడదెబ్బకు మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం వడదెబ్బకు సొమ్మ సిల్లి పడిపోవడంతో సాటి ఉపాధి కూలీలు కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. కోలుకోలేక రాత్రి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న గూడూరు సిపిఎం మండల కార్యదర్శి జె. మోహన్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పిబి .హుస్సేనయ్య గుడిపాడు గ్రామానికి వెళ్లి మద్దమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వారు మాట్లాడుతూ గుడిపాడు గ్రామంలో వడ దెబ్బతో మరణించిన తెలుగు మద్దమ్మ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్‌గ్రేషియా ఇవ్వాలని , కుటుంబాన్ని అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఉపాధి హామీ చట్టంలో పనిచేసే

మద్దమ్మ ఫైల్ ఫొటో

కూలీలపై చిన్న చూపు చూస్తున్నాయన్నారు. ఉపాధి పనులు జరిగే చోట ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు చలువ పందిరి, మంచినీళ్లు లేకుండా చేశా యన్నారు. పనుల దగ్గర వడదెబ్బతో మరణించిన మద్దమ్మను చూసైనా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ఉపాధి పనుల దగ్గర కనీస వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: వ్యకాసం

కర్నూలు కార్పొరేషన్: గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో తెలుగు మద్దమ్మ ఉపాధి హామీ పనులకు వెళ్లి మరణించారు. ఆమె కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. మద్దమ్మ మరణానికి కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు లేకపోవడం, నీడ కోసం టెంటు లాంటి సౌకర్యాలు లేకపోవడం, ఎండ వేడిమికి తట్టుకోలేక కూలీలు పిట్టల్లా రాలిపోతున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వేసవికాలంలో పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించేవారన్నారు. కానీ నేడు అవి ఏమీ ఇవ్వడం లేదని పేదలపై చిన్నచూపుతో కేంద్ర ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. తెలుగు మద్దమ్మ కుటుంబ సభ్యులను సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్‌తో కలిసి కెవి.నారాయణ ప్రభుత్వ హాస్పిటల్లో పరామర్శించారు. ఇప్పటికైనా ఉపాధి హామీ సిబ్బంది మరణించిన ఉపాధి హామీ కూలి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఉపాధి కూలీల విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

జగనన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గ్రామాలలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కల్లూరు మండలం సర్వ సభ్య సమావేశం ఎంపిపి బోయ శారద అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఇళ్ల నిర్మాణాలపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో అధికారులు బాధ్యతగా మెలగాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపిడిఒ జివి. రమణమూర్తి తహశీల్దార్ టివి. రమేష్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మీది వేముల ప్రభాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నాయకల్లు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

క్రీడలకు ప్రోత్సాహం : టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

విద్యార్థులు తాము ఎంచుకున్న క్రీడలో అంకితభావంతో సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కర్నూలు అసెంబ్లీ టిడిపి ఇన్‌ఛార్జి టిజి. భరత్ అభిప్రాయంపడ్డారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో టిజివి స్పోర్ట్స్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కెపిఎల్ సీజన్ 2 పోటీల మంగళవారం ముగిసాయి. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో టిజి. భారత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి రూ.ఒక లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు అందజేశారు. టిజి. భరత్ మాట్లాడుతూ నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో 25 రోజులపాటు కెపిఎల్ సీజన్ 2 పోటీలను నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడమే ప్రధానంగా భావించాలని గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. భారతదేశంలో క్రికెట్‌ను దైవంతో సమానంగా భావిస్తారని అన్నారు. దేశంలో క్రికెట్ అంటే ఇష్టపడని వారు దాదాపు ఉండరని, క్రికెట్ కున్న ప్రాధాన్యత అలాంటిదని చెప్పారు. తనకు తెలిసిన వారు ఇటీవల దేశ విదేశాల్లో టిజి. పేరుతో క్రికెట్ పోటీలను నిర్వహించి సక్సెస్ ఫుల్‌గా ముందుకు సాగుతున్నారని చెప్పారు. కర్నూల్ నగరంలోని ఎవరైనా ప్రతిభ ఉన్న క్రీడాకారులను తన దృష్టికి తీసుకువస్తే వారిని ఆ పోటీల్లో ఆడించే విధంగా ప్రయత్నం చేస్తానని వివరించారు. కర్నూలు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాము ఎప్పుడు ముందుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో జెం కేర్ కామినేని వైద్యులు డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ ,పోటీల నిర్వాహకులు పార్థు, హుస్సేన్, సత్య సింగ్, భాస్కర్, మోహిత్, కేశవ్, రాజేస్, వెంకటేశ్, శ్రీధర్, వినోద్ చౌదరి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ఇస్తున్న టిజి.భరత్

వెంకాయపల్లె వద్ద స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం వెంకాయపల్లి వద్ద మంగళవారం మధ్యాహ్నం ట్రాఫిక్ భారీ ఎత్తున స్తంభించిపోయింది. మంగళవారం ఇక్కడ ఎల్లమ్మ జాతర నిర్వహించడం పరిపాటిగా ఉంటుంది. వేసవిలో జాతరలు ఎక్కువగా నిర్వహించడంతో జనం తాకిడి భారీ ఎత్తున ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ పూజలకు జనం ఎప్పటిలాగే భారీగా తరలి రావడంతో రోడ్డుపై వాహనాలు రాకపోకలు స్తంభించిపోయాయి. వాహనాలు గంట పాటు రోడ్డుమీద బారులు తీరాయి. వివిధ పనుల మీద వాహనాల్లో, బస్సుల్లో బయలుదేరిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే ఎండల తీవ్రత పెరగడంతో ప్రయాణికులు బస్సుల్లో ఊక్కిరిబిక్కిరయ్యారు. వృద్ధులు చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. గత కొద్ది రోజులుగా రహదారి పనులు ఇక్కడ కొనసాగుతున్నడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఇక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఏ ఒక్క పోలీసు లేకపోవడం పలు విమర్శలకు దారితీసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అదేవిధంగా ప్రతి మంగళ,శుక్రవారాల్లో ఇక్కడ ప్రత్యేక ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి సమస్యను నియంత్రించేందుకు కషి చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు.

వెంకాయపల్లె ఎల్లమ్మ వద్ద నిలిచిపోయిన వాహనాలు

గర్భిణీలు, బాలింతలు పరిశుభ్రత పాటించాలి

ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ద్వారం ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గర్భిణీలు బాలింతలు పరిశుభ్రతను పాటించాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూల్ మండలం ఆయుష్ దత్తత గ్రామం పసుపులలో గర్భవతులకు, బాలింతలకు ఆరోగ్య అవగాహనా కార్యక్రమం , వైద్య శిబిరం అంగన్వాడీ కేంద్రం- 3 నందు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీనిపై బాధితులు గర్భవతులు అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లులు గర్భిణిలు, పిల్లలు పౌష్టికాహారం ఆహార పదార్థాలు సమపాళ్లలో తగిన మోతాదులో తీసుకోవాలన్నారు. బలవర్ధకమైన, పోషక విలువలుగల ఆహారం సమపాళ్లలో ఎలా తీసుకోవాలో వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించి గర్భిణిలకు బాలింతలకు పౌష్టికాహారం అయిన వైఎస్ఆర్‌కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పసుపుల గ్రామ ప్రజలు, గ్రామ సచివాలయం హెల్త్ సెక్రెటరీ ఎఎన్ఎంలు బి ఎలిజబెత్ రాణి, అంగన్వాడీ వర్కర్ ఎల్.సువర్ణ, ఆయా చిలకమ్మ , ఆశా వర్కర్లు కె.తులశమ్మ , లక్ష్మిదేవి, ధనలక్ష్మి,ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ ఆర్.మంగమ్మ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కిట్స్‌ను అందజేస్తున్న డాక్టర్ ప్రభాకరరెడ్డి

ప్రతి కూలీకి పనికల్పించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్

ప్రతి కూలికి ఉపాధిని సక్రమంగా కల్పించాలని ఎంపిడిఒ రాముడు సంబందించిన సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాలకు వెళ్లి ఉపాధి కూలీల హాజరును, పని రికార్డులను పరిశీలించారు. వలసలు నివారణకోసం ఉపాధిని ప్రతి కూలికి కల్పించుటలో అలసత్వం తగదన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రాముడు

సప్లిమెంటరీలో మంచి ఉత్తీర్ణత సాధించాలి

- డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

జూన్ 2 నుంచి జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ రంగారెడ్డి తెలిపారు. మంగళవారం దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషినితో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరానికి గాను పదో తరగతిలో 72 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న 36 మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

ప్రజలకు మరింత చేరువలో సేవలు

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

పౌరసరఫరాల శాఖ సేవలను ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువలోకి తీసుకొచ్చిందని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రేషన్ వాహన ఆపరేటర్లకు ఐరిస్ పరికరం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు బియ్యం పంపిణీ చేసే విషయంలో బయోమెట్రిక్ వేసి పంపిణీ చేసే కార్యక్రమం ఉంటుందన్నారు. సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం నూతన టెక్నాలజీ ఐరిస్ డివైస్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఆదోని డివిజన్‌లో 163 రేషన్ వాహన ఆపరేటర్లకు డివైస్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పౌర సరఫరాల ఉప తహశీల్దార్ వలీ బాష పాల్గొన్నారు.

పరికరాలు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఉపాధి అవకాశాలపై శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఫెయిత్ హోంలో డాక్టర్ పి.డానియల్ ప్రేమ్ కుమార్ అధ్యక్షతన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై మంగళవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగ యువత జీవితంలో త్వరగా స్థిరపడేందుకు శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఆలూరు ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుధాకర్, వృత్తి విద్య నిపుణులు సుమంత్, నోబుల్ ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ దేవదానం, కర్నూలు డేప్రింగ్ స్కిల్ ట్రైనింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు సుశాంత్, ఆసిఫ్ ఖాన్ పాల్గొని వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సలోమి, మనోజ్, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్

యాటకల్లు రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని యాటకల్లు గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి రంగస్వామి కోరారు. మంగళవారం తహశీల్దార్ కుమార్ స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యాటకల్లు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 477/1బిలో 34 సెంట్ల భూమి గత 70 ఏళ్ల నుంచి 15 మంది రైతుల అనుభవంలో ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో నోషనల్ ఖాతాగా ఉందని, రెగ్యులర్ ఖాతాగా మార్చాలని కోరారు. పట్టాదారు పాసు పుస్తకాలు, డి పట్టా కలిగి ఉన్నారని పేర్కొన్నారు. గతంలో కైరుప్పల ఎపిజిబి బ్యాంకులో రుణాలు తీసుకున్నారని తెలిపారు. నోషనల్ ఖాతా ఉండడంతో బ్యాంకులో రెన్యువల్ చేయడం లేదన్నారు. నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు బలరాం, వీరేష్, రైతులు మునిస్వామి, సుధాకర్, లక్ష్మన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న

అధ్వానం.. పల్లె రహదారులు

- ప్రమాదకరంగా మారిన గ్రామీణ రోడ్లు - దారులన్నీ గుంతలమయం, బురదమయం

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - హాలహర్వి

రహదారులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పట్టుకొమ్మలని అంటారు. అలాంటి రహదారులు మండలంలో పూర్తిగా పాడైపోయాయి. అడుగేస్తే మడుగు అనే అంతలా పరిస్థితి ఉంది. అక్కడ రోడ్డు ఉందా అనిపించే దారులు మండలంలో లెక్కలేనన్నీ ఉన్నాయి. రోడ్డు నిర్మాణం, మరమ్మతులపై పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ఒకవైపు కంకర తేలిన రోడ్లు, మరోవైపు గుంతలమయమైన రోడ్లు, ఇంకోవైపు బురద రోడ్లు... మండలంలో ఏ దారిలో వెళ్లినా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. రోడ్లపై నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళుతున్నా వాటి మరమ్మతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాలహర్వి మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు పడి, కంకర రాళ్లు తేలి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారుల విషయంపై అధికారులకు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చింతకుంట, శిరుగాపురం, నిట్రవట్టి, ఆలూరు, గూళ్యం, సిద్ధాపురం, చింతకుంట, కొక్కరచేడు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రోడ్లు భారీగా దెబ్బతిని ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడి, కంకర తేలి ఇబ్బందిగా ఉందని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. రాత్రి వేళ వాహనాలపై వెళ్లాలంటే భయమేస్తోందని వాహన దారులు చెబుతున్నారు. ఎన్నోసార్లు కింద పడి గాయాలయ్యాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు స్పందన కార్యక్రమాల్లో ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చామని, రోడ్ల గురించి ఇప్పటి వరకు స్పందన లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు గ్రామీణ విద్యార్థులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారుల్లో కొంతదూరం వెళితే ఒళ్లు గుల్ల అవుతోంది. ఏ కాస్త ఆదమరచిన గోతుల్లో పడి కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. ఇక గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లాలంటే ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోంది. అధికారులు, నాయకులు స్పందించి గ్రామీణ రహదారులను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దెబ్బతిన్న రోడ్లు

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మండలంలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నా, పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో నాయకులు ఓట్ల కోసం ఈ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీలు గుప్పించినా, ఎన్నికల అనంతరం పట్టించుకోవడం లేదు. గ్రామీణ రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారింది. ప్రతేడాది వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత సంవత్సర కాలంలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఈదారి గుండా ప్రయాణించినా ఈ రోడ్లకు మోక్షం కలగడం లేదు.

మీనాక్షి వివాహ వార్షికోత్సవ వేడుక

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుక మంగళవారం ఆదోనిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మీనాక్షి నాయుడు నివాసానికి వెళ్లి ఆ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మీనాక్షి నాయుడు, సులోచనమ్మ దంపతుల జీవితం 50 ఏళ్లు పూర్తి చేసుకుందని, ఇలాగే జీవితాంతం కొనసాగాలని, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 19వ వార్డు ఇన్‌ఛార్జీ శ్రీనివాసాచారి, 13వ వార్డు మాజీ కౌన్సిలర్ బాలాజీ, ఎస్.మహేంద్ర ఉన్నారు.

మీనాక్షి నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

కుక్కలు బాబోయ్ కుక్కలు

- భయాందోళనలో ప్రజలు

- అధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో వీధి కుక్కలు ప్రజలను బెంబేలిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల వెంట ఆడుకునే పిల్లలను వెంబడించి మరీ కరుస్తున్నాయి. కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. రాత్రి సమయంలో పట్టణంలోని పలు కాలనీలు ముగతిపేట, హెచ్‌బిఎస్ కాలనీ, సంజీవ్ నగర్ కాలనీ, గీతానగర్, ఎన్‌టిఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, లక్ష్మీపేట, ఎంబి చర్చి, అటకారి వీధి, మైనారిటీ కాలనీ, శివ సర్కిల్ తదితర అన్ని ప్రధాన వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువైంది. రాత్రి సమయంలో కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లే వారిని బైక్ వెనుక వెంబడించి మరీ కరుస్తున్నాయి. కొన్ని నెలలుగా వీటి బెడద ఎక్కువైంది. వాటి బెడద లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో కుక్కల దాడిలో గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. కుక్కల నివారణకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వీధుల్లో కుక్కల సంచారం

తాగునీటి సమస్య జటిలం

- నెల రోజులుగా దేగలహాల్‌లో తాగునీటికి కటకట

- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై మండిపడుతున్న దేగలపాడు సర్పంచి

- దేగలపాడు, బెల్డోనా, దౌల్తాపురం గ్రామాల్లో తారాస్థాయికి తాగునీటి సమస్య

- సమస్య తలెత్తకుండా చూసుకునేందుకు జల జీవన్ పథకం ద్వారా నిధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవి ప్రారంభం నుంచి చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య జటిలంగా మారింది. దేగలహాల్ గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని సర్పంచి నీలకంఠ అధికారులను నిలదీస్తున్నారు. చింతకుంట జలాశయం నుంచి దేగలహాలు, ఏరూరు, చిప్పగిరి, దౌల్తాపురం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. జలాశయం నుంచి తాగునీరు వదిలే కాంట్రాక్టర్లు ఒక పద్ధతిలో పని చేయకుండా లేని పోనీ సమస్యలు చెబుతూ విద్యుత్ సరిగా లేదని కుంటి సాకులు చెబుతున్నారని సర్పంచులతోపాటు మండల ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాల్లో కనీసం తాగునీరు కూడా అందించడం లేదని సర్పంచులపై ప్రజలు మండిపడుతున్నారు. దౌల్తాపురం, బెల్డోనా గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు, ఎద్దుల బండ్లపై నీటిని తెచ్చుకునే పరిస్థితి దాపురించిందని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నా కిందిస్థాయి సిబ్బంది అనుకున్న స్థాయిలో పనులు చేయకపోవడం వల్లనే తాగునీటి సమస్య తారాస్థాయికి చేరిందని ప్రజలు వాపోతున్నారు.

బోరు వద్ద నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- దేగలహాల్ సర్పంచి నీలకంఠ

తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ప్రజల ఆగ్రహానికి గురికాకుండా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పరిష్కారం చూపాలి. చింతకుంట జలాశయం నుంచి పంపింగ్ చేసే కాంట్రాక్టర్ నగరడోనా నాగేంద్ర చిప్పగిరి మండలంలో ఏయే గ్రామాల్లో ఎక్కువగా తాగునీటి సమస్య ఉందో తెలుసుకొని కనీసం 10 రోజులకోసారి తాగునీరు విడిచేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

చేతిపంపునకు మరమ్మతులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో దర్గా వద్ద చేతిపంపునకు మెకానిక్ పౌలయ్య మంగళవారం మరమ్మతులు చేశారు. మాజీ ఎంపిటిసి ఎల్లప్ప ఆధ్వర్యంలో చుట్టుపక్కల కాలనీవాసులు సహకారంతో బోరును బయటకు తీసి మెకానిక్ పౌలయ్య మరమ్మతులు చేశారు. అనంతరం చేతి పంపు నుంచి తాగునీరు రావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆశాదీప్తి పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం

హొళగుంద : గుంతకల్లులోని హంపయ్య కాలనీలో లెజెండ్ ఉత్తమ ప్రాణదాత సేవా పురస్కార్ కార్యక్రమంలో భాగంగా లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా అనేక సార్లు రక్తదానం చేసిన వారికి మంగళవారం సన్మానం చేశారు. ఎస్‌కె.గిరి 22 సార్లు రక్త దానం చేసినందుకు లెజెండ్ ఉత్తమ ప్రాణ దాత సేవా పురస్కార్ అవార్డుతో సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన గుంతకల్లు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి కుమార్తె, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నైరుతి మాట్లాడుతూ... సమాజంలో అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, రక్త దానం చేస్తే మనిషికి గుండె నొప్పి, క్యాన్సర్‌లాంటి వ్యాధులు రావని తెలిపారు. లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు రంజాన్, హనుమంతు, రాము, బోనాల ప్రకాష్, తిప్పన్న పాల్గొన్నారు.

కాలనీలో నిలిచిన మురుగు

హొళగుంద : మండలంలోని వందవాగిలి బీసీ కాలనీలో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ప్రజల రాకపోకలు, వాహనాలు సంచరిస్తున్నాయి. మురుగు నీరు నిలిచి ఉండడం వల్ల దోమలకు ఆవాసంగా మారింది. దుర్గంధం వెదజల్లుతుండంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని మాజీ సర్పంచి నాగప్ప, వాలంటీర్లు తిమ్మప్ప, హనుమేష్, వెంకటేష్, నీలగిరి ఈరన్న మంగళవారం పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు, గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని మురుగునీరు రోడ్డుపై నిలబడకుండా చూడాలని, చెత్తాచెదారం పూడికతో నిండిపోయిన డ్రెయినేజీకి మరమ్మతులు చేపట్టి, పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరసన బాట పట్టిన సిహెచ్‌ఒలు

ఆదోని : తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రంలో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మంగళవారం నిరసన బాట పట్టారు. ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేసే దాదాపు వంద క్యాడర్లకు జీతాలు పెంచిన ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో విధులు నిర్వర్తించే సిహెచ్‌ఒలను విస్మరించడంపై విచారం వ్యక్తం చేశారు. జీతాల పెంపు, పెండింగ్ వేతనాలు తదితర సమస్యలపై డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. సిహెచ్‌ఒలు కె.నాగరాజు, హరిణి, అహ్మద్, పెద్దతుంబళం, పెద్దహరివాణం, కౌతాళంలో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం - రూ.90 వేల ఆస్తి నష్టం

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. రూ.90 వేల ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన రైతు హరిజన బొడ్డన్న మూడు రోజుల క్రితం ఐదెకరాల ఎండు గడ్డి, రెండెకరాల బుడ్డల పొట్టు మొత్తం దాదాపు రూ.90 వేలతో ఎద్దులకు, ఆవులకు పశు గ్రాసం కొనుగోలు చేసి పశువులకు అందుబాటులో ఉంచుకున్నారు. మంగళవారం అది ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఫైర్ ఇంజిన్ సహాయంతో, గ్రామస్తుల సహకారం తో రెండు గంటల సేపు కృషి చేసి మంటలను ఆర్పివేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

- టిడిపి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి డిమాండ్ చేశారు. మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక తిమ్మారెడ్డి బస్టాండ్ దగ్గర ఉన్న విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీల పేరుతో పేదలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలను ఎనిమిది సార్లు పెంచి, ఆ సాకుతో పథకాలకు అనర్హులను చేస్తున్నారని తెలిపారు. కోతలు లేని విద్యుత్ ఇవ్వాలని, పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. బోరుబావుల మోటార్లకు మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ రాజుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు వెంకటేష్, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, జయరాం, గోపాల్, రవి, బాలాజీ, సుబ్బు, మల్లికార్జున, రామాంజి, మహ్మద్, వలీ, ప్రతాప్ రెడ్డి, నాగరాజు, మాబాష, ఉరుకుంద, సూర్య, వీరేష్, మహేంద్ర, రామలింగ, గౌస్, సాధికా బేగం, శ్రీదేవి, కుమారి పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని టిడిపి మండల కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి మండల విద్యుత్ సబ్ స్టేషన్ ఎడిఇ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. టిడిపి నాయకులు తిరుపతయ్య నాయుడు, శ్రీధర్ నాయుడు, కులుమాల రాముడు, రమేష్ నాయుడు, నూర్ అహ్మద్, అల్ల బండ మిన్నెల్లా, కొత్తింటి అచ్చు గట్ల ఫక్రుద్దీన్, పూజారి రంగస్వామి, రాంపురం లాలు పాల్గొన్నారు. **దేవనకొండ** క్రాస్ సబ్ స్టేషన్ విద్యుత్ కార్యాలయం ముందు టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, మండల నాయకులు ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, మాలిక్ బాష మాట్లాడారు. టిడిపి నాయకులు మల్లయ్య, ఆకుల వీరేష్, బండ్లయ్య, నాగరాజు గౌడ్, రాజశేఖర్ గౌడ్, దేవేంద్ర గౌడ్, మస్తాన్, సుభాన్, తిమ్మయ్య, సూరన్న గౌడ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్దయ్య పాల్గొన్నారు. **నందవరం** మండల టిడిపి కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ర్యాలీగా బయల్దేరి విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం దగ్గర నిరసన చేపట్టారు. టిడిపి నందవరం నాయకులు ఖాసీం వలీ, గడ్డం నారాయణరెడ్డి, నాగరాజు గౌడ్, మండల కన్వీనర్ చిన్న రాముడు, ధర్మపురం గోపాల్, వీరేష్, వీరేష్, గజేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ భవనం ముందు ధర్నాలో పాల్గొన్న భూపాల్ చౌదరి

గోనెగండ్లలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

దేవనకొండలో నిరసన చేపడుతున్న నాయకులు

నందవరం విద్యుత్ ఎఇకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జర్నలిస్టులపై దాడి అమానుషం

- ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వార్త కవరేజీకి వెళ్లిన కర్నూలు జర్నలిస్టులపై దాడి చేయడం అమానుషమని ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, మునెప్ప విమర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎఒ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విలేకరులపై దాడులు చేయకుండా ప్రత్యేక నివారణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, కోశాధికారి సుధాకర్, సహాయ కార్యదర్శి సూర్య బెల్ వాల్మీకి సుధాకర్ ఉన్నారు. **ఎమ్మిగనూరులో** కళ్లకు గంతలు కట్టుకొని ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ జయన్నకు వినతిపత్రం అందజేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్ గౌరవాధ్యక్షులు యుకె.చంద్రశేఖర్, దేవేంద్ర మూర్తి, గోనెగండ్ల మండల ఉపాధ్యక్షులు దండు ఖాజా, సిపిఎం నాయకులు హనుమంతు, రాముడు, సిపిఐ నాయకులు పంపన్న గౌడ్, సత్యన్న, రైతు కూలీ సంఘం నాయకులు హనీఫ్ మాట్లాడారు.

ఆదోనిలో ఎఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు

నాడు-నేడు ద్వారా పాఠశాల నిర్మాణం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని ఎపి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేసింది. పాఠశాలలను కొత్తగా మార్చేసింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి. పాఠశాలలు కొత్త వెలుగులు నింపుకుంటున్నాయి. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును తగ్గించాలని ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.

మండలంలోని బల్లేకల్ గ్రామంలో గత కొన్నేళ్లుగా ఎంపియుపి పాఠశాలగా కొనసాగి 2017లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయింది. పాఠశాల స్థాయిని పెంచారు కానీ, వసతులు మరిచారు. 3 నుంచి 10వ తరగతి వరకు 275 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 3 తరగతి గదులతో, 8 మంది ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యను ఆరుబయట, చెట్ల కింద విద్యార్థులకు విద్యను అందించేవారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పథకం ద్వారా రెండో విడత కింద సుమారు రూ.80 లక్షలతో 12 తరగతి గదులు, కిచెన్ షెడ్, టాయిలెట్స్, విద్యార్థులకు ఆట స్థలం నిర్మాణం చేపట్టారు. అందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.చంద్రశేఖర్ చొరవ తీసుకొని, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, సర్పంచి లోకేష్, గ్రామ సచివాలయం సిబ్బంది, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ప్రభాకర్, గ్రామస్తుల సహకారంతో నాడు-నేడు పనులు చకచకా సాగుతున్నాయి. గతంలో ఈ పాఠశాలలో విద్యనభ్యసించాలంటే సరైన తరగతి గదులు లేకపోవడం, మౌలిక వసతులు లేకపోవడంతో గ్రామానికి చెందిన విద్యార్థులు విద్యను మధ్యలో ఆపేసేవారని గ్రామస్తులు తెలిపారు. 2017లో ప్రధానోపాధ్యాయులుగా డి.చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యార్థులకు నచ్చిన విధంగా పాఠాలు చెబుతూ, తోటి ఉపాధ్యాయులతో, గ్రామస్తుల సహాయ, సహకారాలతో, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు ద్వారా పాఠశాల నిర్మాణం జరుగుతోంది. ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నీచర్, పాఠశాలకు రంగులు, ఆకుపచ్చ సుద్ద బోర్డులు, ఇంగ్లీష్ ల్యాబ్స్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణాలు జరుగుతున్నాయని, విద్యార్థులకు మౌలిక వసతులు, మంచి విద్యనందించేందుకు కృషి చేస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల

గతంలో ఎన్నో ఇబ్బందులు

- డి.చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు, జడ్‌పి హైస్కూల్, బల్లేకల్

గతంలో ఎన్నో ఇబ్బందులతో విద్యార్థులకు విద్యను బోధించాం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనుల ద్వారా విద్యార్థులకు మంచి విద్యనందించేందుకు కృషి చేస్తాం. అన్ని అనుకూలిస్తే ఆగస్టు 15లోపు నూతన పాఠశాల భవనంలో జెండా ఎగరేసేందుకు సిద్ధమవుతున్నాం. గ్రామస్తులు, అధికారులు, పేరెంట్స్ కమిటీ సభ్యుల సహకారంతో నూతన పాఠశాలను ప్రారంభించుకుంటాం. ఇక పదో తరగతి విషయానికొస్తే కె.గంగోత్రి 476, వాణి 470, కె.మల్లికార్జున 470 మార్కులు సాధించారు. పాఠశాలలో మొత్తం 67 శాతం ఉత్తీర్ణత నమోదయింది.

వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి

- వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎఒ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎపి మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని పంటను అమ్ముకోవడానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారని చెప్పారు. ప్రభుత్వం నుంచి రైతులకు అన్ని విధాలుగా సహాయం, సహకారాలు అందిస్తామని తెలిపారు. విపత్తుల్లో రైతులకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందుకుంటున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల దగ్గర నుంచి ఎపి మార్క్‌ఫెడ్ సంస్థ వారు ఇంటర్న్‌కు రూ.1962 మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న పురుషోత్తం రెడ్డి

ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కెసి కెనాల్ ఎఇఇ

40 రోజులు.. 507 కిలోమీటర్లు

- 14 నియోజకవర్గాల్లోనూ సాగిన యువగళం
- ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

40 రోజులు..507 కిలోమీటర్ల మేర ఉమ్మడి కర్నూలు జిల్లాలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సాగింది. 14 నియోజకవర్గాల్లోనూ పాదయాత్ర సాగగా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ లోకేష్ ముందుకు సాగారు..

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏప్రిల్ 13న డోన్ అసెంబ్లీ నియోజకవర్గంతో ప్రారంభమై మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంతో ముగిసింది. మొత్తం 40రోజుల పాటు జిల్లాలో పాదయాత్ర సాగింది. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 45 మండలాలు, 281 గ్రామాల మీదుగా 507 కిలో మీటర్లు పొడవున యువగళం పాదయాత్ర కొనసాగింది. జిల్లాలో 40 రోజుల పాదయాత్రలో లోకేష్‌కు వివిధవర్గాలు, ప్రజలనుంచి రాతపూర్వకంగా 868 వినతిపత్రాలు అందాయి. కర్నూలులో మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లో బహిరంగసభల్లో పాల్గొన్న లోకేష్ 25 ముఖాముఖి సమావేశాలు నిర్వహించి ఆయా వర్గాల సమస్యలు తెలుసుకున్నారు. దారిడిపొడవునా లోకేష్‌ను మహిళలు, యువకులు, వృద్ధులు కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకుంటున్నారు. యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ నెల 15న శ్రీశైలం నియోజకవర్గం మోతుకూరులో తల్లి భువనేశ్వరితో కలిసి లోకేష్ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఏప్రిల్ 21న ఆదోనిలో యువగళం పాదయాత్ర 1000 కిలో మీటర్ల మైలురాయి చేరుకుంది. ఏప్రిల్ 24న పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆదోని నియోజకవర్గం తుంబళం క్రాస్ వద్ద పల్లెప్రగతి కోసం మీ లోకేష్ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీరహితంగా సర్పంచులు తరలివచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే పంచాయితీలకు నిధులు, విధులు కల్పిస్తామని, వాటర్ గ్రిడ్ ఏర్పాటుతో గ్రామాల్లో 24/7 సురక్షితమైన తాగునీరు అందిస్తామని, సర్పంచులకు గౌరవవేతనంతోపాటు గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సచివాలయ వ్యవస్థను పంచాయితీలకు అనుసంధానిస్తామని తెలిపారు. మే 7న కర్నూలులో ముస్లిం మైనారిటీలతో నిర్వహించిన లోకేష్‌తో గుప్తగు కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లిం సోదరులు తరలివచ్చి వైసిపి ప్రభుత్వం వచ్చాక తాము పడుతున్న కష్టాలు చెప్పుకున్నారు. జగన్ ప్రభుత్వ అసమర్ధత వల్లే మైనారిటీలపై దాడులు పెరిగాయని, టిడిపి అధికారంలోకి వచ్చాక ముస్లింలకు రక్షణ కల్పిస్తామని యువనేత భరోసా ఇచ్చారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని, మైనారిటీల ఆస్తుల పరిరక్షణకు వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు కల్పిస్తామని చెప్పారు.

100 కిలో మీటర్లకు ఒక హామీ

పాదయాత్రలో ప్రతి వంద కిలోమీటర్లకు ఒక అభివృద్ధి కార్యక్రమానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయా అభివద్ధి కార్యక్రమాలను పూర్తిచేస్తామని యువనేత హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 5 శిలాఫలకాలను లోకేష్ ఆవిష్కరించారు. డోన్ నియోజకవర్గం ప్యాపిలిలో 900 కిలో మీటర్ల సందర్భంగా గుండాల ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఆదోని సిరిగుప్ప క్రాస్ వద్ద వెయ్యి కిలోమీటర్ల మైలురాయి చేరుకుంది. ఈ సందర్భంగా ఆదోని టౌన్ వార్డ్ 21 ని దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనేగండ్లలో పాదయాత్ర 1100 మైలురాయికి చేరుకున్న సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 10వేలమందికి ఉపాధి కల్పించే టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుచేస్తామని హామీ ఇస్తూ, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నందికొట్కూరు నియోజకవర్గం అల్లూరులో 1200 మైలురాయి సందర్భంగా హంద్రీనీవా నుంచి మిడుతూరు ఎత్తిపోతల పథకానికి హామీ ఇచ్చి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాదయాత్ర 1300 మైలురాయి చేరుకున్న సందర్భంగా యాతం ఫంక్షన్ హాలు వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. నంద్యాల రూరల్ కానాలలో టిడిపి అధికారంలోకి వచ్చాక పసుపు మార్కెట్, కోల్డ్ స్టోరేజి ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేల ఉక్కిరి బిక్కిరి..!

పాదయాత్ర సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో లోకేష్ నిర్వహిస్తున్న బహిరంగసభల్లో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు చేస్తున్న అవినీతిని ఆధారాలతో సహా బట్టబయలు చేయడంతో అధికారపార్టీ నేతలకు ముచ్చెమటలు పట్టాయి. డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఆలూరు నియోజకవర్గంలో మరో మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోనిలో సాయిప్రసాద్ రెడ్డి, మంత్రాలయంలో బాలనాగిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వంటి నాయకుల అవినీతిని ప్రజాక్షేత్రంలో తూర్పారబట్టారు. అవినీతి ఎమ్మెల్యేలకు ఆయా నియోజకవర్గాల ప్రజలు పెట్టిన నిక్ నేమ్ లను ఉచ్చరిస్తూ లోకేష్ చేస్తున్న ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా సెల్ఫీ ఛాలెంజ్‌లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో యువనేత పాదయాత్ర సందర్భంగా విసిరిన పలు సెల్ఫీ చాలెంజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సెల్ఫీ చాలెంజ్ ద్వారా యువనేత లోకేష్ అధికార పార్టీని ఇరకాటంలో పెట్టాయి.

ఉమ్మడి జిల్లాకు ఇచ్చిన ప్రధాన హామీలు..

కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు
ఆర్డీఎస్ కుడికాల్వ, వేదవతి, గుండ్రేవుల పనులు పూర్తి
68 చెరువులకు హంద్రీనీవా నీళ్లు
హంద్రీనీవా కాలువ విస్తరణ, తుంగభద్ర ఎల్ఎల్‌సి కాల్వల ఆధునీకరణ
ఆదోనిలో మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజీ
ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు
జొలదరాసి, రాజోలు రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి
అవుకు రెండో టన్నెల్ నిర్మాణం పూర్తి
మిడుతూరు ఎత్తిపోతల పథకం నిర్మాణం

ప్రజాశక్తి కథనానికి స్పందన

బ్రిడ్జి నిర్మాణంపై విచారణ

- సమస్య పరిష్కారానికి నివేదిలు పంపాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - పాములపాడు

ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 21న 'దళిత గ్రామంపై వివక్ష' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ స్పందించారు. పాములపాడు మండలం జూటూరు మజరా కోల్స్ ఆనందపురం గ్రామానికి వెళ్లే కెసి కెనాల్ బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవడంపై సంబంధిత ఇరిగేషన్, కెసి కెనాల్ అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. తక్షణమే సమస్య పరిష్కారానికి నివేదికలు పంపించాలని ఆదేశించారు. అలాగే రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు సిఎం ఆఫీస్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి కోల్స్ ఆనందపురం బ్రిడ్జిపై ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. కెసి కెనాల్ ఏఇఇ శ్రీనివాసనాయక్ కోల్స్ ఆనందపురానికి చేరుకొని శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని, నిర్మాణం మధ్యలో ఆగిన పిల్లర్స్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి ఫిర్యాదుదారుడు వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి సామన్న, గ్రామ నాయకులు మదిలేటి, ఉపేంద్ర, కోల్స్ ఆనందపురం గ్రామస్తులు చంద్రపాల్, యోహాను, దానమయ్య, గ్రామ పెద్దలతో మాట్లాడి త్వరలోనే బ్రిడ్జి మంజూరు అవుతుందని, ప్రతిపాదన పంపామని తెలిపారు.

పేదల సంతోషమే ప్రభుత్వం లక్ష్యం

- ప్రతి నిరుపేదకూ జగనన్న ఇళ్లు : కలెక్టర్
- 3,006 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి నిరుపేదకూ ఇళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ అన్నారు. పేదలందరికీ జగనన్న ఇళ్లు నవరత్నాలలో భాగంగా మంగళవారం నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్బీసీ కాలనీలోని టిడ్కో గృహాల వెనుక భాగంలో కుందూనది దగ్గర కేటాయించిన ఇళ్లను నిరుపేదలకు కేటాయించారు. ఈ సందర్భంగా 3,006 మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్.మాబున్నిసా, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా అయ్యాక మొట్టమొదటి సారిగా ఇంత పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాలకు అనేక అడ్డంకులు ఉన్నా జిల్లా యంత్రాంగం అన్నింటినీ క్లియర్ చేసి పేదలకు ఇళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ భూమి తక్కువగా ఉందని, ఉన్న వాటిలోనే ప్రతిఒక్కరికి ఇళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇళ్ల పంపిణిలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో మీడియా సమక్షంలో అధికార యంత్రాంగం కేటాయించినట్లు చెప్పారు. ఈ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్క్, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రానికి అవసరమైన స్థలంను రిజర్వ్ చేసి పెట్టామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, తక్షణమే ఇళ్లు నిర్మించుకోవాలని హౌసింగ్ ద్వారా రూ.1.80 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పొదుపు గ్రూప్ సభ్యులైతే మెప్మా, డిఆర్‌డిఏ, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా రూ.35 వేలు ఇస్తామని, ప్రతి ఒక్కరూ ఇళ్లు కట్టుకోవాలని కోరారు. లేకుంటే ఉన్న స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి హయాంలో పేదలకు ఇళ్ల కేటాయింపులు రియల్ ఎస్టేట్ చేస్తే వైసిపి ప్రభుత్వం ఒక రూపాయికే ఇల్లు కేటాయించి పట్టాలు అందజేస్తుందని తెలిపారు. పట్టణంలో మూడు వేల ఆరు మంది లబ్ధిదారులకు లే ఔట్ వేసి ఇల్లు కేటాయించామన్నారు. ఎంపీ మాట్లాడుతూ నంద్యాల పట్టణాన్ని శిల్పా కుటుంబం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకట్ దాస్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆళ్లగడ్డలో వినతి పత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కర్నూల్‌లో ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆర్ టివి విలేకరులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్ హరినాధరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు నిజాముద్దీన్, తాలూకా అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు నాగరాజు మాట్లాడుతూ ఆదివారం రాత్రి కర్నూలులో ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆర్ టీవీ రిపోర్టర్లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక చట్టం తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టివిఎస్‌వి. ప్రసాద్, ఫ్రైమ్ 9 ప్రసాద్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** కర్నూలు, హైదరాబాద్‌లలో జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన కడప ఎంపి అవినాష్ రెడ్డి అనుచరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు, టిడిపి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం రీసర్వే డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు భాస్కర్‌రెడ్డి, బాలుడు, మహబూబ్ భాష, రవి, శివ, గౌస్, టిడిపి నాయకులు టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు, జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్, గఫార్, బషీర్, టైలర్ అమీర్, శ్యాబుల్, ఇమాం హుసేన్, కసినేని ఓబులేసు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చాగలమర్రిలో డిటికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు,టిడిపి, ప్రజా సంఘాల నాయకులు

జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు : పిడి

ప్రజాశక్తి - కొత్తపల్లి

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి సిబ్బంది పనులు కల్పించాలని, పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి తెలిపారు. మంగళవారం కొత్తపల్లి ఎంపిడీవో కార్యాలయం ఆవరణంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ముందుగా గత వారం రోజుల నుంచి గ్రామాల్లో తనిఖీ చేసిన సామాజిక బృందం నివేదికలు వివరించారు. అనంతరం పిడి మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కూలీలకు పనులు కల్పించలేక ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. గ్రామాల్లో రాజకీయాలు చేసి కూలీలకు పనులు కల్పించకపోతే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కనీసం జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిదే అన్నారు. సాకులు చెప్పి పనులు కల్పించకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని సిబ్బందిని హెచ్చరించారు. కొత్తపల్లి మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 601 పనుల గాను రూ.7,05,10,265 ఖర్చు చేసిందన్నారు. ఇందుకుగాను సామాజిక తనిఖీలో రికవరీ రూ.7,103, పెనాల్టీగా రూ.23,500, పనుల్లో కొలతలు తప్పు చేసినందుకు రూ.72,542, హార్టికల్చర్ కింద రీప్లాంటేషన్ చేసేందుకు రూ.7,52,016 అవకతవకలకు పాల్పడాలని చెప్పారు. ఈ మొత్తాన్ని అధికారులు త్వరలో రికవరీ చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు అన్వర్ బేగం, సలీం భాష, ఎంపిడీవో మేరీ, జడ్పిటిసి సోముల సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమలత, కోర్సు డైరెక్టర్ ఏసుదాసు, ఏపీవోలు రాజు నాయక్, రేష్మ, ఈసీ శ్రీనివాసులు, ముసలమడుగు సర్పంచ్ జమీలాభి, ఎర్రమఠం ఎంపిటిసి ముబీనా బేగం, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రయ్య, పశువైద్యాధికారి భువనేశ్వరి, డిఆర్‌పిఎస్ఆర్‌పి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసిన సిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆళ్లగడ్డకు బదిలీపై వచ్చిన సిఐ ఎం.రమేష్ బాబు జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డిని మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎం.రమేష్ బాబు నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై సిఐగా కడప జిల్లా బద్వేల్‌లో పోరుమామిళ్లకు వెళ్లారు. అనంతరం బదిలీలో భాగంగా ఆళ్లగడ్డకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిసిన సిఐ రమేష్ బాబు

యువగళానికి విశేష స్పందన

- అన్ని సీట్లలో టిడిపిని గెలిపించండి
- ఉమ్మడి కర్నూలును నెంబర్ వన్ చేస్తా : లోకేష్

ప్రజాశక్తి-ఆళ్లగడ్డ

రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడిపిని అన్ని సీట్లలో గెలిపిస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాను అబివృద్ధిలో నెంబర్ వన్ చేసి చూపిస్తానని జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. మంగళవారం యువగలం పాదయాత్రలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో ఆయన పాదయాత్ర సాగింది. బైపాస్ విడిది కేంద్రం నుండి నాలుగు రోడ్ల సెంటర్, టిబి రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు పాదయాత్ర జరిగింది.. పాత బస్టాండ్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి నవనరసింహులు కొలువైన ఆధ్యాత్మిక కేంద్రం ఆళ్లగడ్డ అని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కరువులో అందరికీ అన్నం పెట్టిన దానకర్ణుడు బుడ్డా వెంగల్ రెడ్డి, ఆళ్లగడ్డ శిల్పాలకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందని ఎంతో చరిత్ర ఉన్న ఆళ్లగడ్డ లో పాదయాత్ర చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని తమ సొంత అమ్మలా భావించి స్వర్గీయ భూమా దంపతులు ఎంతో అభివద్ధి చేశారన్నారు. తెదేపా హయాంలోనే ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివద్ధి చెందిందన్నారు. భూమా అఖిలప్రియ, భూమా విఖ్యాత రెడ్డి లను ఇబ్బందులు పెడుతున్న వారిని వెంటాడి, వేటాడుతామని వచ్చేది అధికారంలోకి తామేనని నారా లోకేష్ అన్నారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని దొబ్బి ఇప్పుడు ఏమి తెలియని అమాయకుడిలా పేదవాడిని అని జగన్ అంటున్నాడని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన వాటికే మరలా శంకుస్థాపన చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి 200 వారాలు దాటిన సిపిఎస్ రద్దు చేయలేదన్నారు. పోలీసులు దాచుకున్న డబ్బులను వదల లేదన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ లను వేధిస్తున్నారని టిడిపి వచ్చిన వెంటనే వారికి న్యాయం చేస్తామన్నారు. ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటు చేస్తామన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల నాని కాదని లూటీ నాని అని అన్నారు. ఆళ్లగడ్డలో ఐ టాక్స్ అంటే అందరికీ తెలుసని మహిళలను మనం గౌరవించాలని పేరు చెప్పడం లేదన్నారు. ఐ టాక్స్‌తో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ నాకు తెలుసు అన్నారు. ఇసుక, ఎర్రమట్టి కాంట్రాక్టులు, అక్రమ బియ్యం రవాణా ప్రతిదాంట్లో లూటీ చేస్తూ లూటీ నాని దాదాపు 200 ఎకరాలు కొన్నారని వైకాపా కార్యకర్తలు, నాయకులే మాట్లాడుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ చెస్సుల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని, ఆఖరికి దేవుని కూడా వదలలేదని అహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దందా చేస్తున్నారన్నారు. జగన్ పాలనలో నిధులు లేక అభివృద్ధి చేయలేకపోతున్నామని మున్సిపల్ చైర్మన్ ప్రతి సమావేశంలో చెబుతున్నారన్నారు. భూమా అఖిలప్రియ మీకోసం పోరాడుతోందనిఆడ పులి బయటకు వస్తుందని అన్నారు. అనంతరం శోభ ఘాట్ వద్దకు చేరుకుని భూమా నాగిరెడ్డి, శోభనాగిరెడ్డి విగ్రహాల వద్ద లోకేష్ నివాళులు అర్పించారు. ఈ పాదయాత్రలో టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, బనగానపల్లె, ఆత్మకూరు, పాణ్యం, డోన్, మాజీ ఎమ్మెల్యేలు బీసీ జనార్ధన్ రెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డి, బుడ్డ రాజశేఖర్ రెడ్డి, గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్లెల రాజశేఖర్, చాగలమరి మాజీ సర్పంచ్ అన్సర్ భాష, కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జడ్పిటిసి చాంద్ బాషా, రాము యాదవ్, కాంట్రాక్టర్ నన్నే భాయ్ గారి జిలానీతో పాటు భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమా నాగిరెడ్డి సమాధి వద్ద నివాళ్లులర్పిస్తున్న నారా లోకేష్

మాట్లాడుతున్న నారా లోకేష్

బోగస్ మస్టర్లు నివారించండి : వ్యకాస

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లను నివారించాలని, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపల్లిలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి ఎపిఒ, సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్ల కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కొన్ని గ్రామాల్లో బోగస్ మస్టర్లు వేసుకొని ఉపాధి నిధులను కాజేస్తున్నారని తెలిపారు. ఎర్రమఠం గ్రామంలో వర్క్ శాంక్షన్ లేకుండానే ఉపాధి కూలీలతో పనులు చేయించి అధికారులు బిల్లులు చేయకుండా కూలీల కడుపు కొట్టడం తగదన్నారు. కూలీలకు బిల్లులు చెల్లించమంటే పిడి అసహనంగా చేయలేమని చెప్పడం ఆయన స్థాయికి తగదన్నారు. జిల్లా స్థాయి అధికారులే కూలీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్షేత్రస్థాయిలో పరిష్కరించేది ఎవరది ప్రశ్నించారు. కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో నీడ, మెడికల్ కిట్లు, నీళ్ల వసతి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు జగదీష్, చిన్న పుల్లయ్య, శీలం, ఉషెనయ్య, పకీరయ్య, కే స్వాములు తదితరులు పాల్గొన్నారు.

పిడికి కూలీల సమస్యలు వివరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వాలంటీర్ల సేవలు అభినందనీయం : జడ్పిటిసి

ప్రజాశక్తి - పాములపాడు

ప్రభుత్వ పథకాలను సూర్యుడు ఉదయించక ముందే ప్రతి ఇంటికి చేరవేసే వాలంటీర్ల సేవలు ఎంతో గొప్పవని పాములపాడు జడ్పిటిసి జ్యోతి రామలింగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూటూరు, తుమ్మలూరు గ్రామాలలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులను అందజేశారు. ప్రభుత్వం వీరి సేవలను గుర్తిస్తుందని ఆమె అన్నారు. అనంతరం వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వనమాల ప్రసాదరావు, ఏవో కర్ణ సాగర్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, నాయకులు రామలింగేశ్వర రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న జడ్పిటిసి జ్యోతి రామలింగేశ్వర రెడ్డి తదితరులు

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి

తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న అధికారులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను మంగళవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు న్యాయమూర్తి కుటుంబ సమేతంగా చేరుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, వేద పండితులు స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - సంజామల : మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షురాలు పోచా రమాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగ కుమార్, డిటి అనిల్ కుమార్, అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

కంచర్ల ఈశ్వరయ్య మృతి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - మహానంది : టిడిపి సీనియర్ నాయకులు కంచర్ల ఈశ్వరయ్య ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కంచర్ల ఈశ్వరయ్య(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని కంచర్ల ఈశ్వరయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మండల అధ్యక్షుడు ఉల్లి మధు, కార్యకర్తలు వున్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచర్ల పట్టణంలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించే కార్యక్రమం చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట వీధి కుక్కలు అధికంగా ఉన్నాయని చెప్పారు. నెల్లూరు జిల్లా నుండి కుక్కలను పట్టే వారిని పిలిపించి కుక్కలను పట్టించి వాటిని బేతంచర్ల శేషారెడ్డి పశు వైద్యశాలకు తరలించి వెటర్నరీ ఏడి వసంత లక్ష్మి, డాక్టర్ అజయ్ వాక్సినేషన్ వేసి వదిలిపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ పశు వైద్యురాలు డాక్టర్ శంషాద్ బేగం, వెటర్నరీ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి - బనగానపల్లె : పాణ్యం మండలం సుబ్బరాయుని కొత్తూరు గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, ప్రధాన అర్చకులు నారాయణస్వామి, కష్ణయ్య స్వామి, భాస్కరయ్యలు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పి చైర్మన్

కోవెలకుంట్లను మోడల్‌గా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

కోయిలకుంట్లను ఇప్పటికే అభివృద్ధి బాటలో నడిపించానని, మున్ముందు మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. కోయిలకుంట్లలో రూ.4.48 కోట్లతో చేపట్టిన సిసి రోడ్లు, డ్రెయినేజీ, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్తు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. అనంతరం సర్కిల్ కార్యాలయం ఎదుట బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. బనగానపల్లె పట్టణంలో రూ. 22 కోట్లతో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. కోయిలకుంట్ల పట్టణంలో గతంలో ఒకే ఒక డాక్టర్‌తో ఇక్కడ ప్రభుత్వ వైద్యశాల నడిచేదని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామన్నారు. కోయిలకుంట్ల పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టడమే కాకుండా డ్రైనేజీ వ్యవస్థను కూడా సమూలంగా మార్పులు చేస్తామన్నారు. మునుముందు కూడా బనగానపల్లె నియోజకవర్గ ప్రజల సహాయ సహకారాలు తనకు అందిస్తే రాబోయే కాలంలో ఇంకా అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కర్ర గిరిజ హర్షవర్ధన్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్ర హర్షవర్ధన్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు భీమిరెడ్డి రమాదేవి, జడ్పిటిసి వెంకట లక్ష్మమ్మ, సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచి జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి, వెలుగుటూరు సర్పంచి ఎల్వి సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నాగార్జున రెడ్డి, పొట్టిపాడు అందె శ్రీనివాసరెడ్డి, ఏపీ ఎన్జీవోఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణా రెడ్డి, భీమిరెడ్డి ప్రతాపరెడ్డి, రైతు సంఘం నాయకుడు కానాల రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ల సంఘం వైఎస్ఆర్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి, సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, తహశీల్దార్, ఎంపీడీవో, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ, అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ, ముందస్తు అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి విద్యాశాఖ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నంద్యాల పట్టణంలో ఉన్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యులు రేకుల షెడ్డులో తరగతి గదులు నిర్వహిస్తూ, ఆట స్థలం, పార్కింగ్, శానిటేషన్ సర్టిఫికెట్, అర్హత కలిగిన అధ్యాపకులు, ఫైర్ సర్టిఫికెట్ తదితర ఏమీ లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుండి అనుమతులు రాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ల కోసం రంగురంగుల కరపత్రాలు వేయించి ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్లుగా చూపిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ అక్రమ అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలను విద్యాశాఖ అధికారులు స్పందించి సీజ్ చేయాలన్నారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్‌గా ప్రత్యేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

- విద్యుత్ వినియోగదారులపై రూ. 57,188 కోట్ల భారం
- టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - డోన్

జగన్ రెడ్డి లూటీ, అవినీతి కారణంగా విద్యుత్ వినియోగదారులపై రూ.57,188 కోట్ల భారం మోపారని టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం టిడిపి ఆదేశాల మేరకు పెరిగిన కరెంటు కోతలు, విద్యుత్ ఛార్జీల పెంపుపై పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఎదుట పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, మండల అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పది వేల మెగావాట్ల అదనపు విద్యుత్ సామర్థ్యం పెంచారని, కానీ జగన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యుత్ ఇతర రాష్ట్రాలకు అమ్మేస్థాయికి దిగారని అన్నారు. నాడు కరెంటు కోతలు లేవని, ధరలు కూడా పెంచలేదన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఒక యూనిట్ అదనపు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచింది లేదని, పైగా కరెంటు కోతలు బాగా పెరిగాయని తెలిపారు. పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు వెంకట నారాయణ గౌడ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు, ప్రజావైద్యశాల బస్సా మల్లిఖార్జున, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. **పాములపాడు :** పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని టిడిపి ఆధ్వర్యంలో పాములపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి మాట్లాడారు. అనంతరం సబ్ స్టేషన్ ఎఇరేటుకు వినతిపత్రం అందజేశారు. టిడిపి నాయకులు శివశంకర రెడ్డి, రామ చౌదరి, బషీర్ అహ్మద్, భాస్కర్ రెడ్డి, లింగస్వామి, అర్జున్ గౌడ్ పాల్గొన్నారు. **బేతంచెర్ల :** పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని బేతంచెర్లలోని డోన్ రూట్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లా నాగయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో డోన్ నియోజకవర్గం గౌరవ సలహాదారుడు కాకర్ల తిరుమలేష్ చౌదరి, రాష్ట్ర ముస్లిం నాయకులు జాకీరుల్లా బేగ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ బుగ్గనపల్లి రమేష్, కౌన్సిలర్ రామాంజనేయులు, రామ్ గోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, ఎమ్మెస్, ముల్లా, మలిపెద్ది నాగేశ్వర్ రెడ్డి, జూజాది వెంకటేశ్వర్లు, పట్టణ బిసి సెల్ అధ్యక్షుడు టైలర్ రాముడు, ఫయాజ్, సయ్యద్, అంజాద్, షబ్బీర్ వలి, చంద్ర, అరుణ్ కుమార్, యోగేంద్ర బాబు, శ్రీధర్, ప్రసాద్, చింతకాయల విజయ్ కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి లొద్దశేఖర్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ, వాసు, కానాల అంజి, నల్లాడి, గుడిసె మద్దిలేటి స్వామి, శివ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

పాములపాడులో నిరసన చేపడుతున్న నాయకులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆళ్లగడ్డ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలో యువగళం పాదయాత్రలో భాగంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు నిజాముద్దీన్, తాలూకా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 నాటికి దాదాపు 25 వేల మందికి అక్రిడిటేషన్లు ఉంటే ఇప్పుడు అందులో సగం మందికి కూడా లేవన్నారు. జర్నలిస్టులకు గుర్తింపుగా అందించే అక్రెడేషన్ కార్డు విషయంలో 142 జీవో తీసుకువచ్చి భారీగా కోతలు విధించి చాలామంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వకుండా చేశారన్నారు. ఇప్పటివరకు కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగాయన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భీమాను ప్రభుత్వమే చెల్లించి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. జర్నలిస్టులు విధులు చేసే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టించి ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన జర్నలిస్టులకు రూ. 5 లక్షలు, అంగవైకల్యం పొందిన జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయాన్ని ఇవ్వాలన్నారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ తమ ప్రభుత్వం వస్తే జర్నలిస్టులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, కోశాధికారి నాగరాజు, టీవీఎస్‌వి ప్రసాద్, ఖాసీం వలి, శ్రీనివాస్, ప్రైమ్9 ప్రసాద్, సురేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాబలం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, ఆరోగ్యమే మహాబలంమని గ్రంథాలయ అధికారి పి.రాఘవ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో భాగంగా విజ్ఞాన విషయాలతో పాటు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా, ధ్యానం, ఆటలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై పోటీ పడాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వ్యక్తిగత విమర్శలు మాని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అభివృద్ధిపై పోటీ పడాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, తాను చేసిన విమర్శలపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే టిడిపి ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు రూ.3 కోట్ల బిల్లులు వస్తే ఎమ్మెల్యే 20 శాతం కమీషన్ తీసుకున్నాడని, తాను ఏ దేవుని వద్ద అయినా ప్రమాణం చేస్తానని అన్నారు. ప్రతి పనికి ఎమ్మెల్యే కమీషన్ తీసుకున్నాడు కాబట్టే నారా లోకేష్ కమీషన్ కాటసాని అన్నారని తెలిపారు. తాము రాజకీయ ప్రత్యర్థులమని, వ్యక్తిగత శత్రువులను కాదని, ప్రజల నుండి వచ్చిన విషయాలపై విమర్శలు చేస్తే సమాధానం చెప్పాలన్నారు. షాదీఖానాకు తాను సొంత నిధులు 30 లక్షలు ఇచ్చానని, పనులు చేసి కమిటీ ద్వారా ఆ నిధులను తీసుకున్నానని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి జిఎం టాకీస్ వరకు ఫోర్‌లైన్ పనులను మూడు సంవత్సరాలుగా చేస్తున్నారని, నారా లోకేష్ పాదయాత్రకు వస్తున్నారని హడావుడిగా పెట్రోల్ బంకు కూడలిలో సిసి రోడ్డు వేశారని, జిఎం టాకీస్ సమీపంలో గుంతలు తోగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధికి, వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధికి తాము బహిరంగ సభకు ఎప్పుడైనా సిద్ధమన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, టిడిపి కొలిమిగుండ్ల మండల అధ్యక్షులు మూలే రామేశ్వర రెడ్డి, నంద్యాల రామేశ్వర రెడ్డి, విఆర్ లక్ష్మీరెడ్డి, యువ నాయకులు కాత్రేడ్డి మల్లికార్జున రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు బురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి, నాయకులు టిప్‌టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్, కైపా రఘునాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - నంద్యాల : రాయలసీమ రైతు జీవితాలను తన కథల్లో చిత్రించిన కథకుడు, నవలా రచయిత, విమర్శకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు చిలకల బాలరాజు తెలిపారు. మంగళవారం స్థానిక పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి కవులు, రచయితలు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. వానకురిస్తే, గడ్డి, నమ్ముకున్న నేల వంటి కథల్లో రాయలసీమ రైతు దీనస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించారని అన్నెం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు నీలకంఠమాచారి, మహబూబు బాష, మహమ్మద్ రఫీలు తమ కవితల ద్వారా కేతు విశ్వనాథరెడ్డి సాహితీసేవను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక సభ్యులు డా.నీలం వెంకటేశ్వర్లు, రవికుమార్, శేషఫణి, షఫీవుల్లా, గ్రంథాలయాధికారి శ్రీధర్, సాహితీప్రియులు, పాఠకులు పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు చెల్లింపులకు 31 గడువు

ప్రజాశక్తి - బేతంచెర్ల : ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులు మళ్లీ పరీక్ష రాసేందుకు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని భాగ్యోదయ హైస్కూల్ చైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులు అపరాధ రుసుం లేకుండా ఈనెల 25 వరకు, అపరాధ రుసుం రూ.25 లతో ఈనెల 29 వరకు, రూ. 50తో ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రీ కౌంటింగ్‌కు రూ. 200, రీ వెరిఫికేషన్, సమాధాన పత్రం జిరాక్స్‌తో కలిపి రూ.1000 ఈ నెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. సప్లమెంటరీ పరీక్షలు జూన్ 26 నుండి జులై 4 వరకు ఉంటాయని తెలిపారు.

వాలంటీర్ల సేవలు అమోఘం : చైర్మన్

డోన్‌లో వాలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

ప్రజలకు వాలంటీర్లు చేస్తున్న సేవలు అమోఘమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మంగళవారం డోన్ మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో పట్టణంలోని 7వ సచివాలయంకు సంబంధించి 11వ వార్డు వాలంటీర్లకు చైర్మన్ ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లకు సన్మాన సేవ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సేవామిత్రలకు రూ.10 వేలు, సేవా రత్నలకు రూ.20 వేలు, సేవా వజ్రలకు రూ. 30 వేలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. డోన్ పట్టణంలో 268 మంది వాలంటీర్లకు గాను అవార్డు గ్రహీతలు 240 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో సేవ మిత్రలు 233 మంది, సేవ రత్నలు 5 మంది, సేవ వజ్ర ఇద్దరు ఉన్నారని చెపప్పారు. వాలంటీర్లు అందరూ క్రమశిక్షణతో వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎపి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకిర్ హుస్సేన్, జిల్లా బీసీ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, పట్టణ యూత్ అధ్యక్షులు ఆర్ఇ.రాజవర్ధన్ గౌడ్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, సచివాలయల కన్వీనర్ కురుకుందు హరి, వైసిపి నాయకులు సతీష్, జనార్ధన్, బద్దలహరి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మున్సిపాలిటీ పరిధిలోని జై కిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్ ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని 3, 4 సచివాలయాల పరిధిలోని వాలంటీర్ల సేవలను గుర్తించి అవార్డులను చైర్మన్, కమిషనర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు పి.చాంద్ భాష, అల్లూరి క్రిష్ణ అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లాలు ప్రసాద్, వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్, సచివాలయ కార్యదర్శులు మాధవిలత, లక్ష్మీ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేష్ పక్కన భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగురవేస్తాం

- భూమా నాగిరెడ్డి రాజకీయం ఆళ్లగడ్డలో చేసి చూపిస్తాం
- టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డలో టిడిపి జెండాను ఎగురవేస్తామని టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. మంగళవారం నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా ఆళ్లగడ్డ పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగత్ విఖ్యాత్ రెడ్డి మాట్లాడారు. మొదటిసారిగా నారా లోకేష్ మన ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ఘనంగా స్వాగతం పలికామన్నారు. తల్లిదండ్రులు లేని తమకు ఆళ్లగడ్డ ప్రజలు వారు లేని లోటు తీర్చారన్నారు. యువకుల సమస్యలను తీర్చేందుకు యువ నేత నారా లోకేష్ సిద్ధంగా ఉన్నారన్నారు. నాలో సగమైన అక్క, బావ ఇక్కడ లేకపోవడం బాధాకరమన్నారు. నారా లోకేష్‌ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో తన బిడ్డను పక్కనపెట్టి అక్క అఖిలప్రియ నారా లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేశారన్నారు. అక్కకు పేరు వస్తుందని చూసి ఓర్వలేక కొంతమంది దుర్మార్గులు కుట్రలు పన్నారన్నారు. కుట్ర పన్నిన ఐదుగురు గుంట నక్కలను తాము అధికారంలోకి వస్తే వెంటపడి తరిమికొడతామన్నారు. భూమా దంపతులు టిడిపితో కమిట్మెంట్తో పని చేశారని, తాము కూడా అలాగే నంద్యాల, ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగురవేయిస్తామన్నారు. తాము కేసులకు భయపడే రకం కాదన్నారు. అక్క, బావ మీద కేసులు పెట్టి సంకలు గుద్దుకుంటున్న వారికి భూమా నాగిరెడ్డి రాజకీయం చేసి చూపిస్తామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని యాంటీ పోచింగ్ రేంజర్ పి.సుభాష్ తెలిపారు. మిషన్ లైఫ్ స్టైల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుండిపెంట, శ్రీశైలం, లింగాల గట్టులో పర్యావరణ పరిరక్షణపై ఫారెస్ట్ రేంజ్ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింగాలు గట్టు, యాత్రికుల పుష్కర ఘాటు, వాల్మీకుల కాలనీలోని ప్రాథమిక పాఠశాల, లింగాలగట్టు ఫారెస్ట్ చెక్‌పోస్ట్, వ్యూపాయింట్‌లో స్థానికులకు, యాత్రికులకు ఎఫ్ఎస్ఓ మదనమోహన్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వేయరాదని, ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ఓబులేసు, సుండిపెంట బీటు ఆఫీసర్ పి.సలావుల్లా, రవీంద్రనాథ్ ఠాగూర్, ఎస్ భీంనాయక్, పి.శ్రీరాములు, ప్రొటెక్షన్ వాచర్స్, లింగాల గట్టు కాలనీవాసులు చెన్నయ్య, రాతం శీను, సుబ్బరాయుడు, అనిల్, నాగలింగం, నల్లబోతుల శ్రీను పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని హరినగరం గ్రామంలో పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రజలకు డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు, రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు,వారి ఉత్తర్వుల మేరకు నూతల సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలన్నారు. ఇంటింటికి కనీసం ఒక మొక్కను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : బిసి ఇందిర

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

విద్యార్థులు క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందుతారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, యోగా, కబడ్డీ, వాలీబాల్ సమ్మర్ క్యాంపులో పాల్గొంటున్న విద్యార్థులకు బిసి ఇందిరా రెడ్డి తన సొంత నిధులతో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రీయ స్థాయిలో రాణించి నియోజకవర్గానికి, తల్లిదండ్రులకి, గురువులకి మంచి పేరు తేవాలన్నారు. బాక్సింగ్, కరాటేలో అమ్మాయిలు మెరుగుపడాలని సూచించారు.

కాత్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ విద్యక, హర్ష, చౌడయ్య, రామయ్య, రమేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ గృహాలు పేదలకు ఉచితంగా ఇవ్వాలి

- అఖిల పక్షాలు డిమాండ్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

సుండిపెంటలో జల వనరుల శాఖ గృహాలలో నివాసం ఉంటున్న పేదలకు భూమి పన్ను (గ్రౌండ్ రెంట్) రద్దు చేసి వారికే ఇండ్లను ఉచితంగా ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం తర్వాత తహశీల్దార్ బి.రాజేంద్ర సింగ్‌కు, జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులకు వారి వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుండి పెంటలోని జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఒక ప్రభుత్వ ప్రకటనను అనౌన్మెంట్ ద్వారా నోటీసు రూపంలో కాలనీవాసులకు తెలియజేయడం జరిగినది. ఈ విషయంలో భాగంగా ప్రజాసంఘాల నాయకులు దీనిపై సంబంధిత అధికారులు కలిసి గ్రౌండ్ రెంటు, కరెంటు బిల్లు, వాటర్ బిల్లులపై మాట్లాడారు శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 35 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని, వీరందరూ దాదాపు 60 సంవత్సరాల నుండి శ్రీశైలం ఆనకట్ట నిర్మాణం పనులకు సేవలు అందించి వారిలో ఈ కుటుంబాలు ఇక్కడే స్థిరపడిపోయారన్నారు. అప్పటి నుండి ఇప్పటివరకు వీరికి తాగునీరు, విద్యుత్తు, వైద్యం సదుపాయాలను జల వనరుల శాఖ ఆధీనంలో కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆనకట్ట నిర్మాణం పూర్తి కావడంతో జలవరుల శాఖ నిధులు లేవనే సాకుతో ప్రజలను ఇబ్బంది పెడుతుండడం సమంజసం కాదన్నారు. ప్రజా సంఘాల ఆందోళన ఫలితంగా పాత విద్యుత్ బకాయిలు అప్పటి న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి చొరవతో రూ.40 కోట్లకు పైగా చెల్లించారని తెలిపారు. అప్పటి నుండి సుండిపెంట అభివృద్ధికి కొంత బడ్జెట్ కేటాయిస్తున్నారని చెప్పారు. ఆ నిధులతోనే తాగునీరు, కరెంటు సదుపాయాలను కల్పిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ గృహాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని, అక్కడ నివాసముంటున్న వారే వాటిని మరమ్మతులు చేయించుకోవాలని చెప్పారన్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా 2016 నుండి పాత బకాయి విద్యుత్ బిల్లులు, భూమి పన్ను, వాటర్ చార్జీలు కట్టమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే పాత బకాయిలు, పన్నులు రద్దు చేసి ప్రభుత్వ గృహాలకు నివాసముంటున్న పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆశీర్వాదం, సిపిఐ మండల కార్యదర్శి పి.పులి రాజు, టిడిపి నాయకులు జంకె రామసుబ్బారెడ్డి, ఉమా, బిజెపి నాయకులు సోమిశెట్టి మల్లికార్జున, గ్రామ అభివృద్ధి కమిటీ కార్యదర్శి కత్తుల కోటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు ఓబులయ్య, ఏఐవైఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య, ఐఎఫ్టియు వై.శ్రీను, ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ జాబేద్, మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిన్ని శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నాగేళ్ల సురేష్, ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ.బెనహర్, ఎస్కే వలి, వెంకటేశ్వర్లు, కార్మిక, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న అఖిలపక్షాల నాయకులు

పచ్చి రొట్టె ఎరువుల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - రుద్రవరం

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పచ్చి రొట్టె ఎరువుల విత్తనాలను ముందుగా నమోదు చేసుకున్న రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్ద కంబలూరు, చిన్న కంబలూరుగ్రామ రైతు భరోసా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమాలలో పాల్గొని కౌలు కార్డు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి జ్యోతి